సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



పడిపోతున్న ప్లేట్‌లెట్స్..!

సాధారణంగా జ్వరాల వ్యాప్తి జూన్‌నెలలో ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం జ్వరాల వ్యాప్తితో జనం ఇబ్బంది పడుతున్నారు.

- 10లో



డీఐజీ ఆధ్వర్యంలో నాకాబందీ

జిల్లా పోలీసులు పలు ప్రాంతాల్లో నాకాబందీ, కార్డన్‌సెర్చ్‌లు నిర్వహించారు. సోదాలు జరిపారు.

- 10లో



యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

గెడ్డతిరువాడ గ్రామ సమీపాన మూడు రోజులుగా కొందరు యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలను జరిపిస్తున్నారు.

- 10లో

న్యూస్‌రీల్

జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా శివనాగజ్యోతి



శివనాగజ్యోతి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివనాగజ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆమె పాలకొండ ఏరియా ఆస్పత్రి వైద్యురాలిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బి.వాగ్దేవి డీసీహెచ్‌ఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి, మెరుగైన వైద్యసేవలు అందించి రిఫర్ కేసుల సంఖ్య తగ్గించేందుకు చర్యలు చేపడతామని డాక్టర్ శివనాగజ్యోతి తెలిపారు.

ఏనుగుల విధ్వంసం



ఏనుగులు విరిచేసిన వ్యవసాయ బోరును చూపిస్తున్న బాధిత రైతు మిన్నారావు

భామిని: మండలంలోని బిల్లుమడ గ్రామ సమీపంలో తిష్టవేసిన ఏనుగుల గుంపు వ్యవసాయ బోర్లను ధ్వంసం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. నేరడి–బికి చెందిన సరిసాబద్ర మిన్నారావుకు చెందిన వ్యవసాయ బోరును, పైపులను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. రైతు సమాచారంతో అటవీశాఖ అధికారులు వచ్చి బోరును పరిశీలించారు.

1 నుంచి 10 తరగతులు ఒకే చోట సరికాదు



బాలకృష్ణ

పార్వతీపురం టౌన్: ఒకటి నుంచి 10వ తరగతి వరకు తరగతులను ఒకే చోట నిర్వహించడం సరికాదని, వెంటనే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.బాలకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన విద్యా విధానాలు విద్యారంగానికి మేలుచేసే విధంగా ఉండాలే తప్ప నష్టపరచకూడదన్నారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి 1557 పాఠశాలల్లో 1, 2 తరగతులు కూడా కలిపి 1 నుంచి 10 తరగతుల వరకు కొనసాగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తామన్నారు. రాష్ట్రం మొత్తం 9,200 మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని నిర్ణయించడం, దాదాపు 700 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం మంచిదేనన్నారు. అయితే, ఒక్కో పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, విద్యార్థుల సంఖ్య 20 దాటితే మూడో పాఠశాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలు 6 నుంచి 10 తరగతులు మాత్రమే ఉండాలన్నారు. 30 మందికి ఒక సెక్షన్ ఉంచుతూ ఆంగ్ల, తెలుగు మాధ్యమాలు సమాంతరంగా కొనసాగించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో కలిపిన 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపాలన్నారు. ఫౌండేషన్ స్కూళ్ల పేరుతో రాష్ట్రంలోని దాదాపు 5వేల పాఠశాలలను కేవలం 1 ,2 తరగతులతో నిర్వహించడం వల్ల తల్లిదండ్రులు వారి పిల్లలను కేవలం రెండు సంవత్సరాల విద్యకోసం పంపించారని, వాటిని బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు.

21న కంచి విశ్వవిద్యాలయ ప్రవేశాలు



డాక్టర్ టి.రవిరాజు

విజయనగరం: కంచి విశ్వవిద్యాలయ ప్రవేశాలు ఈ నెల 21న విశాఖపట్నం శంకర మఠంలో నిర్వహించనున్నట్టు శ్రీకంచి కామకోటి శంకర మఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ద్వారకానగర్ శంకర మఠంలో 21న, 22న విజయనగరంలోని సన్ స్కూల్ ఆవరణలో, అదే రోజు శ్రీకాకుళంలోని గాయత్రి స్కూల్, గీతాంజలి స్కూల్ ఆవరణలోనూ ప్రవేశ ప్రక్రియ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు యూనివర్సిటీ వీసీ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్, వైస్ చాన్సలర్ కె.వెంకటరమణ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జగన్ చొరవ ఫలితం...



గిరిజనుల చెంతన విద్యాదీపం

- కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి సొంత క్యాంపస్
- సువిశాల ప్రాంగణంలో చకచకా భవనాల నిర్మాణం
- వచ్చే విద్యాసంవత్సరానికల్లా సిద్ధం చేయడానికి కృషి



జీప్లస్‌టు అకడమిక్ బ్లాక్ నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి 2023 ఆగస్టు 25వ తేదీన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసినచోటనే శాశ్వత క్యాంపస్ సమకూరుతోంది. గిరిజనుల జీవితాల్లో కాంతులు నింపాలంటే ఈ విద్యాదీపం నిబంధనల ప్రకారం వారి చెంతనే ఉండాలన్న ఆయన ఆశయం నెరవేరుతోంది. ప్రస్తుతం విజయనగరం శివారు గాజులరేగ వద్ద ఏయూ స్టడీ సెంటర్ భవనాల్లో తాత్కాలికంగా కొనసాగుతున్న ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థను ఎస్టీ రిజర్వ్‌డ్ సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలానికి మార్చేందుకు మార్గం సుగమమవుతోంది. పచ్చని కొండల నడుమ 561.88 ఎకరాల సువిశాలమైన ప్రకృతి రమణీయతతో కూడిన చక్కని ప్రాంతంలో విద్యాసౌరభాలు విరబూయనున్నాయి. రూ.834 కోట్ల నిధులతో భవనాల నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. పరిపాలన భవనం (అడ్మిన్ బిల్డింగ్), తరగతి భవనాలు (అకడమిక్ బ్లాక్స్), విద్యార్థుల వసతి భవనాలను రానున్న విద్యాసంవత్సరానికి పూర్తి చేయడానికి అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

గత ప్రభుత్వంలోనే పనులు మొదలు...

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో తాగునీరు, ఇతరత్రా నీటి అవసరాలను తీర్చేందుకు రూ.7 కోట్లతో డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు పనులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయి. భారీ ట్యాంకు నిర్మాణం పూర్తి అయ్యింది. పైప్‌లైన్ల పనులు కొలిక్కి వస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనకు నిధులు, రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం చెల్లింపునకు గత ప్రభుత్వంలోనే రూ.61.06 కోట్లు మంజూరయ్యాయి. రూ.16 కోట్లు అప్రోచ్ రోడ్డుకు, డ్రైయిన్లు, మరో రూ.48.61 లక్షలు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించింది. అప్పటికే ఆ భూముల్లోనున్న 220 కేవీ విద్యుత్తు టవర్లను తొలగించడానికి రూ.12.43 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు 2022 జూన్ 14వ తేదీన ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే.



నిర్మాణంలో విద్యార్థినుల హాస్టల్ భవనం



చకచకా వైస్ చాన్సలర్ బంగ్లా నిర్మాణం



గెస్ట్ హౌస్ నిర్మాణం

రేగిడి హెచ్‌ఎం సస్పెన్షన్

- డిప్యూటీ మేట్రిన్‌కు షోకాజ్ నోటీసులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలంలోని రేగిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడినిసస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీచేసినట్టు గుమ్మలక్ష్మీపురం సహాయ గిరిజన సంక్షేమ అధికారి బి.సురేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఓ విద్యార్థినిని హెచ్‌ఎం ప్రభుత్వ ఆస్పత్రికి కాకుండా కురుపాంలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించిన సంగతి తెలిసిందే. ఆశ్రమ పాఠశాల ఎదురుగా ఉన్న పీహెచ్‌సీకి కాకుండా ప్రైవేటు క్లినిక్‌కు తీసుకెళ్లడంపై గిరిజన సంఘాల నాయకులు అనుమానం వ్యక్తంచేశారు. దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ పీఓలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నెల 21న ఇదే అంశంపై కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించేందుకు గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంఘం, అఖిల భారత యువజన సమాఖ్య, ట్రైబల్ రైట్స్ ఫోరం, ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టిన కలెక్టర్ గురువారం రాత్రి రేగిడి పాఠశాల హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులతో పాటు, ఆ పాఠశాల డిప్యూటీ వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఏటీడబ్ల్యూఓ తెలిపారు.

అన్నింటిలోనూ అటెండర్!

- పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం పనులన్నీ చిరుద్యోగి కనుసన్నల్లోనే..
- అధికారులపైనా హూంకరింపు
- మందు, విందుతో ప్రసన్నం చేసుకుంటున్న వైనం
- భార్య పేరుతో అధికారులకు అద్దెకార్లు
- దివ్యాంగ ఉద్యోగి స్థానంలో అనధికారికంగా మరొకరి నియామకం
- అదే వ్యక్తితో అధికారి ఇంటిలో వెట్టిచాకిరీ
- ఆయన తీరును చూసి విస్మయపోతున్న ఉద్యోగ వర్గాలు



పార్వతీపురంటౌన్:

ఆయన జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగంలో ఓ చిరుద్యోగి. అయితేనేం... ఆయనకు అందరూ సలాం చెప్పాల్సిందే. ఎదురు ప్రశ్నించేవారు అధికారి అయినా స్థానిక బలాన్ని అడ్డుపెట్టుకుని ముందు బెదిరిస్తారు. తర్వాత మందు, విందుతో మచ్చిక చేసుకుంటారు. తర్వాత అన్నీ తానై వ్యవహరిస్తారు. ఆ శాఖ పరిధిలో ఏ పని జరగాలన్నా ఆయన అనుమతి ఉండాల్సిందే. కమీషన్ ఇచ్చుకోవాల్సిందే.! సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు ఒకే చోట మూడేళ్లు, ఐదేళ్లు పనిచేస్తే బదిలీలు జరగడం సహజం. ఆయన మాత్రం 20 ఏళ్లుగా అదే కార్యాలయంలో పాతుకుపోయారు. కొన్నేళ్లుగా చిరుద్యోగి సాగిస్తున్న దందా, అవినీతి పనులతో ఉద్యోగవర్గాలు కలవరపడుతుండగా, ఆయన మాత్రం ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నారు.

అంతా వ్యాపారమే..

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయాన్ని ఆ చిరుద్యోగి వ్యాపార కేంద్రంగా మార్చేశారు. ప్రశ్నించిన అధికారులపై స్థానిక నేతలతో ఫోన్ చేయించి బెదిరిస్తున్నారు. తన భార్యపేరిట మూడు షిఫ్ట్ డిజైర్ కార్లను డీపీఆర్‌ఈఓ, మరో ఇద్దరు మండలాభివృద్ధి అధికారులకు ఎంగేజ్‌లో పెట్టినట్లు సమాచారం. ఇంజినీరింగ్ శాఖ పరిధిలో బిల్లుల అంచనా, ప్రతిపాదనలు, చెల్లింపుల్లో ఆయనదే పైచేయి. దీనికోసం అధికమొత్తంలో వసూళ్లుచేసి పై అధికారులకు అందజేసేందుకు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తన పనులు, కారు బిల్లులు సకాలంలో పొందేందుకు అధికారులకు మందు, విందు ఇస్తున్నారు. కార్యాలయాన్ని బార్‌గా మార్చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

మన్ననలు పొందేందుకు...

అధికారుల మన్ననలు పొందేందుకు ఆ చిరుద్యోగి ఎంతకైనా తెగిస్తారని రుజువైంది. కార్యాలయ పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చేస్తారు. ఆ శాఖలో కీలక అధికారి అండదండలతో అదే శాఖలో పనిచేస్తున్న దివ్యాంగ నైట్ వాచ్‌మన్‌ను బెదిరించి, ఆయన వద్ద నుంచి నెలకు రూ.10వేలు వసూలుచేస్తూ ఆ స్థానంలో వేరే ప్రైవేటు వ్యక్తిని నియమించారు. ఆ వ్యక్తితో కీలక అధికారి ఇంటిలో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ఆ అధికారి మన్ననలు పొందుతూ తన పనులను చక్కబెట్టుకుంటున్నారు. బిల్లుల చెల్లింపులో రూ.లక్షలు దండి వాటాలు పంచుతున్నారన్నది ఆ శాఖ వర్గాల్లోనే కొందరు బహిరంగంగా చెబుతుండడం గమనార్హం. ఆయన తీరు అందరికీ తెలిసినా చర్యలు తీసుకునేందుకు వెనుకడుగువేస్తున్నారంటే ఆయన ఆర్థిక శక్తిని అర్థం చేసుకోవచ్చు. ఇలాగే వదిలేస్తే అందరికీ 'టెండర్' పెడతారని, కార్యాలయానికి మాయని మచ్చను తెస్తారని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు.

చర్యలు చేపడతాం

పంచాయతీరాజ్ శాఖలో అటువంటి ఉద్యోగులు ఉంటే వారిపై చర్యలు చేపడతాం. ఓ ఉద్యోగి సొంతకార్లు నడుపుతున్న విషయం తన దృష్టికి వచ్చింది. ప్రభుత్వ నిబంధనలకు ఇది విరుద్ధం. ఇతర అంశాలపైనా విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు చేపడతాం.

– చంద్ర శేఖర్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి

గొలుసు దొంగల ఆటకట్టు

- మూడు కేసుల్లో నలుగురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏసీపీ లక్ష్మణరావు

ఎంవీపీకాలనీ:

నగరంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల జరిగిన వరుస గొలుసు దొంగతనాల కేసులను ద్వారకా క్రైం పోలీసులు ఛేదించారు. ఎంవీపీ క్రైం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ద్వారకా క్రైం ఏసీపీ లక్ష్మణరావు ఆ వివరాలు వెల్లడించారు. నగరంలో వరుస దొంగతనాలు జరగడంతో క్రైం పోలీసు విభాగం అప్రమత్తమై త్వరితగతిన నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

- శివాజీపాలెంలో శోభారాణి అనే మహిళ నుంచి 4 తులాల బంగారు గొలుసు అపహరించిన నిందితులకు తీవ్ర నేర చరిత్ర ఉన్నట్లు తెలిపారు. విజయవాడకు చెందిన నాగరాజు, ఇమ్రాన్‌లను ఈ కేసులో నిందితులుగా గుర్తించామని, ఇప్పటికే నాగరాజుపై 35, ఇమ్రాన్‌పై 25 పాత కేసులు నమోదైనట్లు చెప్పారు.
- మద్దిలపాలెం చైతన్యనగర్‌కు చెందిన హేమలత అనే మహిళ నుంచి బంగారు గాజులు, చైను లాక్కొని పరారైన నిందితుడు విజయనగరానికి చెందిన సిరిపురపు వెంకటరమణగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు క్రైం ఏసీపీ తెలిపారు. అతనికి గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని వెల్లడించిన ఏసీపీ.. అతని నుంచి రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దొంగిలించిన బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.2,80,500కు నిందితుడు తాకట్టు పెట్టినట్లు వివరించారు. ముత్తూట్ ఫైనాన్స్ నుంచి ఈ మొత్తాన్ని రికవరీ చేయాల్సి ఉందన్నారు.
- ఎంవీపీ కాలనీలో లలిత అనే 90 ఏళ్ల మహిళ మెడలో రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటనలో నిందితుడు రైల్వే న్యూ కాలనీకి చెందిన పిడుగు జగదీష్‌గా గుర్తించినట్లు ఏసీపీ తెలిపారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

పైడితల్లికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పార్చన అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి పైడితల్లి అమ్మవారు శుక్రవారం స్వర్ణ పుష్పార్చనలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. అనంతరం వేద పండితులు అచ్యుతశర్మ, దూసి శివప్రసాద్ శాస్త్రోక్తంగా అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన సేవను నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ కేఎన్ వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● గుడ్ ఫ్రైడే



పార్వతీపురం మన్యం జిల్లాలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శిలువ యాత్రను నిర్వహించారు. క్రీస్తు ఆరాధనా గీతాలను ఆలపించారు. ఫాదర్లు, పాస్టర్ల యేసు శాంతి సందేశాలను శ్రద్ధగా విన్నారు. యేసును ఆరాధించారు. సెంట్ జోన్స్ చర్చి విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ సేసీల్ జోషప్, బెలగాం కార్మిక జోజప్ప చర్చి విచారణ కర్త ఫాదర్ తోమస్ రెడ్డి ఆధ్వర్యంలో సాగిన శిలువ యాత్రల్లో వందలాదిమంది క్రైస్తవులు పాల్గొన్నారు. – పార్వతీపురం టౌన్



పార్వతీపురంలో శిలువ యాత్ర

జీడికి దక్కని మద్దతు!

- దళారుల పాలవుతున్న గిరిజన రైతులు
- ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారుల హామీలు



జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని ఇటీవల పార్వతీపురం ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న గిరిజన, ప్రజాసంఘాల నాయకులు

సాక్షి, పార్వతీపురం మన్యం :

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు అటవీ ఉత్పత్తుల్లో ఆర్థిక దన్నుగా నిలిచేది జీడి పంటే. కొండ పోడు భూముల్లో జీడితోటలనే సాగు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఇటువంటి పంట విషయంలో ప్రభుత్వం వారికి మద్దతుగా నిలవడం లేదు. సీజన్ దాటిపోతున్నా.. జీడి పిక్కల కొనుగోలు విషయమై కనీస దయ కరవవుతోంది. కొంత కాలంగా మార్కెట్లో సరైన ధర పొందలేకపోతున్నారు. మరోవైపు మొదట్లోనే తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోతోంది. దీనివల్ల గిరిజన రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. జీడి పిక్కలకు కనీస మద్దతు ధర చెల్లించాలని కొన్నాళ్లుగా రైతులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నా ఫలితం ఉండటం లేదు.

వేలమంది గిరిజన రైతులకు ఆధారం..

జిల్లాలో దాదాపు 68 వేల ఎకరాల్లో జీడి తోటలు సాగులో ఉన్నాయి. 30 వేల మంది రైతులు వీటిపైనే ఆధార పడి జీవిస్తున్నారు. ఇందులో అత్యధికం గిరిజనులే. జీడిపిక్కల దిగుబడి దాదాపు మార్చి నాటికి వస్తున్నప్పటికీ.. ఏప్రిల్ వచ్చినా జీసీసీ ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికే గిరిజనులు దాదాపు 60 శాతం జీడి పిక్కలు దళారులకు విక్రయించేశారు.

సిండికేట్‌గా మారుతున్న వ్యాపారులు

జిల్లాలోని సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు జీడి తోటలపైనే చాలా ఏళ్లుగా బతుకుతున్నారు. ప్రస్తుతం జీడి పిక్కల ధర మార్కెట్లో కిలో రూ.180 వరకు ఉంది. గిరిజనులకు పంట చేతికందేసరికి దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారుతున్నారు. జీడి పిక్కలను కిలో రూ.100 నుంచి రూ.130లోపే కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిరిజన రైతులకు పెట్టుబడి కూడా దక్కడం లేదు. వరి, మొక్కజొన్న, పత్తి మాదిరి జీడి పిక్కలకు మద్దతు ధర ఇవ్వాలని.. జీసీసీ, వెలుగు ద్వారా కొనుగోలు కేంద్రాలు తెరవాలని ఎప్పటి నుంచో ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నా ఫలితం దక్కడం లేదు. వాస్తవానికి మన్యం జిల్లా జీడికి మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు ఏటా ఈ సీజన్ అధికంగా రవాణా అవుతోంది. కనీసం జీడి పిక్కలను నిల్వ చేసుకునేందుకు గోదాములు కూడా జిల్లాలో అందుబాటులో లేవు.



ప్రకటనలకే పరిమితమవుతున్న ప్రాసెసింగ్ యూనిట్లు

జీడి పిక్కల ద్వారా మంచి ఆదాయం పొందేలా ఐటీడీఏల పరిధిలో ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించాలని అధికారులు తరచూ ప్రకటనలైతే చేస్తున్నారు గానీ.. ఆచరణలోకి రావడం లేదు. జీడి పప్పు మార్కెటింగ్‌లో రైతులు దళారుల బారిన పడకుండా వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా మంచి ధర కల్పించేలా చూడాలని ఐటీడీఏ, వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరుల్లో యూనిట్లను స్థాపించనున్నట్లు చెబుతున్నారు. ఇవన్నీ ప్రకటనలకే పరిమితమవుతున్నాయి.

జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి..

జీడి పిక్కలకు కిలో రూ.200, 80 కిలోల బస్తా రూ.16 వేల చొప్పున మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని పలు సందర్భాల్లో గిరిజన, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. వారి రోదనను పట్టించుకునే తీరిక ఎవరికీ ఉండటం లేదు. ఇటీవల పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు కూడా నిర్వహించారు. అయినప్పటికీ అధికారుల్లో చలనం రాలేదని గిరిజన సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

కొబ్బరిబొండాల వ్యాన్ బోల్తా



బోల్తాపడిన వ్యాన్

సీతానగరం: మండలంలోని అంటిపేట వద్ద కొబ్బరి బొండాల వ్యాన్ బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. దీనిపై అంటిపేట గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలంలోని అంటిపేట మీదుగా పార్వతీపురం వెళ్తున్న కొబ్బరిబొండాల వ్యాన్ అంటిపేట గ్రామ శివారులో వ్యక్తిని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న పొలంగోతిలో పడింది. వ్యాన్ డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. వ్యాన్ ముందు వీల్స్ మట్టిలో కూరుకుపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు చెబుతున్నారు.

జేసీబీ, 3 ట్రాక్టర్లు సీజ్



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్లు

బొండపల్లి: మండలంలోని వెదురువాడ పంచాయతీ పరిధి పాడిపేట గ్రామ సమీపంలో అక్రమంగా గ్రావెల్ మట్టిని తవ్వి వెదురువాడలోని జిరాయితీ భూమిలో వేస్తుండగా అందిన ఫిర్యాదు మేరకు 1 జేసీబీతో పాటు, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ డోలా రాజేశ్వర్రావు తెలిపారు. ఈ సందర్భంగా జేసీబీ డ్రైవర్ శీల గణేష్‌తో పాటు తాడి పైడినాయుడు, శీల శ్రీను, యడ్ల గోపిలు గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్ చేసి రూ.25 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. సీజ్ చేసిన వాహనాలను బొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్సై యు.మహేషకు అప్పగించినట్లు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం జిల్లా గనుల శాఖ ఎ.డికి నివేదిక అందజేసినట్లు తెలిపారు.

పిడుగుపాటుతో ఆవు మృతి



ఆవు కళేబరం

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం కురిసిన పిడుగుల వర్షంతో పిడుగుపాటుకు గురై గ్రామానికి చెందిన హరిశ్రీను ఆవు మృతి చెందింది. పొలంలో మేత మేస్తుండగా అకస్మాత్తుగా గాలి వర్షంతో పాటు పిడుగులు పడడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన విషయంలో గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజనుల అభ్యున్నతికి కమిషన్ కృషి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



వినతిపత్రం అందుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఎస్టీ కమిషన్ కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. షెడ్యూల్ ప్రాంతాల్లో భూములపై గిరిజనులకే హక్కులు దక్కేలా చర్యలు తీసుకోవాలని ట్రైబల్ డెవలప్‌మెంట్ మిషన్ సంస్థ ప్రతినిధులు పలువురు శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం చేసిన చట్టాలు అమలయ్యేలా చూడాలని వారు కోరారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన భూసమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విస్తృత పర్యటన చేస్తూ వారి సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కమిషన్ కృషి చేస్తోందన్నారు. గిరిజన ప్రాంతవాసుల సమస్యలు కమిషన్ దృష్టిలో ఉన్నాయని సంబంధిత చట్టాలు అమలు చేసేలా ప్రభుత్వాన్ని కమిషన్ కోరుతున్నట్లు చెప్పారు. చైర్మన్‌ను కలిసిన వారిలో అజయ్‌కుమార్, తిరుమల రావు, గోపాలరావు, చంద్రరావు తదితరులు ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹216

పడిపోతున్న ప్లేట్‌లెట్స్..!

- సాధారణ జ్వరపీడితులకూ గుబులు
- ప్లేట్‌లెట్స్ సాధారణ స్థితి1.50లక్షల నుంచి 4.75 లక్షలు
- బ్లడ్‌బ్యాంక్‌లను ఆశ్రయిస్తున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: పి.శ్రీను అనే వ్యక్తి జ్వరంతో బాధపడుతూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అతనికి వైద్య పరీక్షలు చేయగా మలేరియా జ్వరం అని నిర్ధారణ అయింది. ప్లేట్ లెట్స్ 30 వేలకు తగ్గిపోయాయి. దీంతో వైద్యులు బిపాజిటివ్ ప్లేట్ లెట్స్ ఎక్కించాలని చెప్పడంతో ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌ను ఆశ్రయించగా మూడు యూనిట్లు ప్లేట్‌లెట్స్ ప్యాకెట్లు అందించారు.

☛ కె.ఆదినారాయణ అనే వ్యక్తి జ్వరంతో సర్వజన ఆస్పత్రిలో చేరగా వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. వైద్య పరీక్షల్లో ప్లేట్‌లెట్స్ కౌంట్ 20 వేలకు తగ్గింది. దీంతో వైద్యుడు ఒ పాజిటివ్ గ్రూప్ ప్లేట్‌లెట్స్ నాలుగు యూనిట్స్ ఎక్కించాలని చెప్పగా బంధువులు ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్ సిబ్బందిని ఆశ్రయించి నాలుగు యూనిట్స్ ప్లేట్‌లెట్స్ ప్యాకెట్స్ ఇచ్చారు.

☛ భాస్కరరావు అనే మరో వ్యక్తి జ్వరంతో బాధపడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరగా వైద్య పరీక్షల అనంతరం మలేరియాగా నిర్ధారణ అయింది. ప్లేట్‌లెట్ కౌంట్ 4 వేలకు పడిపోయింది. దీంతో వైద్యులు ఒ పాజిటివ్ గ్రూప్ ప్లేట్‌లెట్స్ ప్యాకెట్స్ నాలుగు ఎక్కించాలని చెప్పగా సర్వజన ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బందిని ఆశ్రయించగా నాలుగు యూనిట్స్ ప్లేట్ లెట్స్ ప్యాకెట్లు అందించారు.

వీరు ముగ్గురే కాదు. జ్వరాల బారిన పడిన అనేక మందికి ప్లేట్ లెట్స్ కౌంట్ తగ్గిపోతోంది. దీంతో ప్లేట్‌లెట్స్ కోసం వారి బంధువులు బ్లడ్ బ్యాంక్‌లను ఆశ్రయిస్తున్నారు. గతంలో డెంగీ జ్వరం వస్తే ప్లేట్‌లెట్స్ తగ్గిపోయేవి. కానీ ఇప్పుడు సాధారణ జ్వరాలకు కూడా ప్లేట్‌లెట్స్ తగ్గిపోతున్నాయి. దీంతో రోగులు ఆందోళన చెందుతున్నారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్

జ్వరాల వ్యాప్తి ఆరంభం

సాధారణంగా జ్వరాల వ్యాప్తి జూన్‌నెలలో ఎక్కువగా ఉంటుంది. అయితే ప్రస్తుతం జ్వరాల వ్యాప్తి ప్రారంభమైంది. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు, ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ జ్వర పీడితులు చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రితో పాటు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు జ్వర పీడితులు వస్తున్నారు. వారిలో కొంతమంది ఓపీ విభాగంలో చికిత్స చేయించుకుని వెళ్లిపోగా, కొంతమంది ఇన్ పేషెంట్లుగా ఆస్పత్రుల్లో చేరుతున్నారు. చిన్న పిల్లలు కూడా ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు.

నెలకు 150 నుంచి 200 మందికి ప్లేట్‌లెట్స్ వినియోగం

జిల్లా వ్యాప్తంగా అనేక మందికి ప్లేట్‌లెట్స్ అవసరం అవుతున్నాయి. నెలకు 150 నుంచి 200 మందికి ప్లేట్‌లెట్స్ వినియోగిస్తున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయిన రోగులకు వాటిని అందించడం కోసం రోగిబంధువులు బ్లడ్ బ్యాంక్‌లను ఆశ్రయిస్తున్నారు. ప్లేట్‌లెట్స్ సకాలంలో ఎక్కించకపోతే ప్రాణాల మీదకు వస్తుందని వైద్యులు చెప్పిన వెంటనే రోగి బంధువులు ప్లేట్‌లెట్స్ తెచ్చి వైద్యసిబ్బందితో రోగులకు ఎక్కిస్తున్నారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



ప్లేట్‌లెట్స్

బ్లడ్ బ్యాంక్‌ల వివరాలు:

జిల్లాలో ప్లేట్‌లెట్స్ లభ్యమయ్యే బ్లడ్‌బ్యాంకులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ , న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్, ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంక్‌లలో ప్లేట్‌లెట్స్ అందిస్తారు.

అవసరమైన వారికి అందజేత

డెంగీ జ్వరంతో పాటు వైరల్ జ్వరం వచ్చిన వారికి ప్లేట్‌లెట్స్ తగ్గుతుంటాయి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌కు ప్లేట్‌లెట్స్ కోసం వచ్చిన వారికి అందజేస్తున్నాం.

డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రాను విజయవంతం చేయాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: ప్రతి శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై కలెక్టర్ శుక్రవారం జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరగాలని స్పష్టం చేశారు. 'ఇ వేస్ట్ మేనేజ్‌మెంట్' శీర్షికన ఈ నెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొని పరిశుభ్ర వాతావరణం నెలకొనే విధంగా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. మండల ప్రత్యేకాధికారులు, మండల అధికారులు మండల స్థాయిలో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రజలను పెద్ద ఎత్తున కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని కోరారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండడం, కార్యాలయంలో ఇవేస్ట్ నివారణకు తగిన చర్యలు చేపట్టడం, పట్టణ ప్రాంతాల్లో ఇవేస్ట్ సేకరణ చేసి నిల్వ చేసేందుకు అవసరమైన ప్రదేశాలను గుర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో పదివేల జనాభా కంటే ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఈ కార్యకలాపాలను చేపట్టి, చురుగ్గా పాల్గొనాలని అన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కావాలి

జిల్లాలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలన్నీ పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో గల 212 చెత్త నుంచి సంపద కేంద్రాల నుంచి వర్మీకంపోస్టు ఉత్పాదకత జరగాలని స్పష్టం చేశారు. వర్మీ కంపోస్టు విక్రయించి స్వయం సాధికారత సాధించాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు అన్యాయం

- జిల్లా రెల్లికుల సంఘం నాయకుడు గండి డేనియల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెల్లికుల సంఘం నాయకుడు గండి డేనియల్

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం రెల్లి, వాటి ఉపకులాల ఆవేదన ఏమాత్రం పట్టించుకోకపోడం చాలా అన్యాయమని జిల్లా రెల్లికుల సంఘం నాయకుడు గండి డేనియల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన స్వగృహంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ రెల్లి ఉపకులాలలకు 1శాతం రిజర్వేషన్ కల్పించి తీవ్ర అన్యాయం చేశారన్నారు. రెల్లి సామాజిక వర్గానికి సంబంధించి ఆర్థిక, సామాజిక, ఉద్యోగ, రాజకీయాల్లో వెనుకబాటుతనం గురించి తెలిసికూడా ఒక్క శాతం రిజర్వేషన్ కల్పించి ఆర్డినెన్స్ తేవడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. బలవంతులైన మాల, మాదిగలకే అధికప్రాధాన్యం ఇస్తున్నారని, అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న రెల్లిలను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల్లో ఇంతవరకు అభివృద్ధి చెందని వారికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించిందని, కానీ కూటమి ప్రభుత్వం కులగణన ఇంతవరకు చేయలేదన్నారు. రెల్లి వాటి ఉపకులాలు చాలా తక్కువ జనాభా కలిగి ఉన్నాయని ఏ ఆధారాలతో నిర్ణయిస్తారని మండిపడ్డారు. లోపభూయిష్టమైన ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం ఆలోచించి రెల్లిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గండి శరత్ చైతన్య, సొండి గౌరీశంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద భూదానోద్యమం రావాలి

- ఆచార్య వినోబా భావేకు లోకసత్తా ఘనంగా నివాళి

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో స్వచ్ఛంద భూదానోద్యమానికి రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవా సంస్థలు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో స్వచ్ఛంద భూదాన ఉద్యమం సృష్టికర్త స్వాతంత్ర్య సమరయోధుడు, ఆచార్య వినోబా భావే చేపట్టిన భూదాన ఉద్యమం 75ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వినోబాభావే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ.. వినోబా భావే పాదయాత్ర చేస్తూ..1951 ఏప్రిల్ 18న తెలంగాణలోని పోచంపల్లిలో స్వచ్ఛంద భూదాన్ ఉద్యమానికి శ్రీకారం చుట్టి అక్కడ జమీందారు వెదిరే రామచంద్రారెడ్డి మనసును గెలిచి వంద ఎకరాల భూమిని దానంగా స్వీకరించారన్నారు. తెలంగాణలో 1.30లక్షల ఎకరాలు, ఆంధ్రాలో 80 వేల ఎకరాలు వినోబా భావే సేకరించినవి ఉన్నాయని, ఉమ్మడి రాష్ట్రంలో సుమారు రెండు లక్షల యాభై ఎకరాలు పేద ప్రజలకు దాదాపు 50లక్షల ఎకరాల భూమిని దానంగా స్వీకరించి 1965లో అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో భూదాన్ గ్రామ్‌దాన్ చట్టం వచ్చేలా చేశారని కొనియాడారు. తన తాత స్వాతంత్ర్య సమరయోధుడు, స్వర్గీయ భీశెట్టి అప్పారావు అనకాపల్లి శాసనసభ్యుడిగా వినోబా భావే స్ఫూర్తితో స్వచ్ఛంద భూదాన్ ఉద్యమంలో పాల్గొని పేదలకు భూములు పంచారని భీశెట్టి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, ధాత్రాజు రాజారావు, బోరరమేష్, పౌరవేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్ర రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆచార్య వినోబా భావేకు నివాళ అర్పిస్తున్న దృశ్యం

డీఐజీ ఆధ్వర్యంలో నాకాబందీ

- విజయనగరంలో రెండు గంటల పాటు పోలీసుల తనిఖీలు
- 20 కిలోల వెండి, 50 వాహనాలు సీజ్

విజయనగరం క్రైమ్: నాకాబందీ, కార్డన్‌సెర్చ్‌లు వంటి స్పెషల్ ఆపరేషన్లతో పోలీసులు జిల్లాలో తాము ముందుగా నిర్దేశించిన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ క్రమంలో విజయనగరంలో గురువారం రాత్రి విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆధ్వర్యంలో ఎస్పీ వకుల్ జిందల్ స్వీయ పర్యవేక్షణలో ఆకస్మిక తనిఖీలు చేశారు. రాత్రి రెండు గంటల పాటు విస్తృతంగా విజయనగరాన్ని మొత్తం పోలీసులు జల్లెడ పట్టారు. నగరంలోని వై జంక్షన్, వీటీఅగ్రహారం, మయూరీ జంక్షన్, రైల్వే స్టేషన్, ఎత్తుబ్రిడ్జి, ఆర్అండ్‌బీ, కంటోన్మెంట్, కలెక్టరేట్, ఉడాకాలనీ, కామాక్షినగర్, గంటస్తంభం, గూడ్స్ షెడ్, కన్యకాపరమేశ్వరి టెంపుల్, మూడు లాంతర్లు, నీళ్ల ట్యాంక్, దాసన్నపేట, కోట జంక్షన్‌లో ముగ్గురు డీఎస్పీలు,14 మంది సీఐలు, 44 మంది ఎస్సైలు 276 మంది కానిస్టేబుల్స్‌తో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ఈ ఆకస్మిక తనిఖీలో 51 వాహనాలను సీజ్ చేశామన్నారు. అలాగే 4,437వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని చెప్పారు. ప్రధానంగా వన్ టౌన్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 20 కిలోల వెండిని పట్టుకున్నామని తెలిపారు. అలాగే ఒక ఇసుక లారీ, 8 మద్యం బాటిల్స్ సీజ్ చేశామని చెప్పారు. మద్యం తాగిన వారిపై వంద కేసులు బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై రెండు కేసులు నమోదు చేశామని ఎస్పీ వివరించారు. ఆకస్మిక తనిఖీల్లో విజయనగరం కలెక్టరేట్ జంక్షన్ వద్ద విజయనగం టౌన్ డీఎస్పీ శ్రీనివాస్, బొబ్బిలిలో డీఎస్పీ భవ్యా రెడ్డి, చీపురుపల్లి రైల్వేస్టేషన్ వద్ద డీఎస్పీ రాఘవులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారని ఎస్పీ వకుల్ జిందల్ ఈ సందర్భంగా తెలియజేశారు.



విజయనగరం కోట వద్ద తనిఖీలు చేపడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు నాకాబందీ

పార్వతీపురం రూరల్: చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్ (నాకాబందీ) చేపట్టినట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన స్వయంగా గురువారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలో ఉన్న అంతర్రాష్ట్ర రహదారిపై సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఆయా స్టేషన్ల ఎస్సైలు వారి పరిధిలో ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ప్రధానంగా చెక్‌పోస్టుల వద్ద, ప్రధాన కూడలివద్ద స్టాపర్లు ఏర్పాటు చేసి గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమరవాణా, మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, అధిక లోడ్ ఉన్న వాహనాలు, రికార్డుల పరిశీలన, పెండింగ్ చలానాలు తదితర చట్ట వ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ఈ ఆకస్మిక తనిఖీలు ఒకేరోజు జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ అధికారులు నిర్వహించినట్లు తెలిపారు. ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పార్వతీపురం ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ శివారు ప్రాంతాలైన వెంకంపేట గోరీలు, ఎస్‌వీడీ కళాశాల వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో స్వయంగా పాల్గొని వచ్చిపోయే వాహనాలను ఆపి సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.



పార్వతీపురం రూరల్: సిబ్బందితో కలిసి వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



సారా స్థావరం వద్ద స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ టబ్బులను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం)/జియ్యమ్మవలస రూరల్: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కురుపాం ప్రొహిబిషన్/ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జియ్యమ్మవలస మండలం గడసింగుపురం గ్రామపరిసరాల్లో సారా తయారీ స్థావరాలపై శుక్రవారం నిర్వహించిన దాడిలో 700 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా డీపీఈఓ ఆదేశాల మేరకు సీతానగరం ఎక్సైజ్ స్టేషన్ సీఐ పద్మావతి, గజపతినగరం, బొబ్బిలి, కురుపాం ఎక్సైజ్ స్టేషన్‌ల ఎస్సైలు నరేంద్రకుమార్, శ్రావణ్‌కుమార్, జె.రాజశేఖర్ తదితర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారన్నారు. ఆ స్థావరంలో సారా తయారీ కోసం పులియబెట్టేందుకు ఉపయోగించిన ప్లాస్టిక్ టబ్బులతో పాటు 10 లీటర్ల సారాను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అంతేకాకుండా సారా తయారీ శిబిరం నిర్వహిస్తున్న వారితో పాటు ముడిసరుకులు సరఫరా చేసే కోసం దర్యాప్తు నిర్వహిస్తున్నామని, దర్యాప్తులో వాస్తవాలు తేలితే చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

కొత్తవలసలో 200 లీటర్ల బెల్లం ఊట

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామం సమీపంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జీఎస్.రాజశేఖర నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్లు పులబెట్టిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే 4 లీటర్ల సారాను పారబోశారు. పోలీసుల అలికిడిన గమనించిన తయారీదారులు అక్కడి నుంచి జారుకున్నారు. సారా తయారీ, రవాణా, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సీఐ తెలిపారు. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సై వీఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తవలస: బెల్లం ఊటను ధ్వంసం చేసిన పోలీసులు

వృద్ధుడి ఆత్మహత్య

పార్వతీపురం రూరల్: మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన జక్కు దాలినాయుడు (82) కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 12ఏళ్ల క్రితం భార్య మృతిచెందింది. అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తుండగా ఇటీవల కాలికి గాయం కావడంతో శస్త్ర చికిత్స చేశారు. గాయం ఎప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంటిముందు ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఆత్మహత్యకు పాల్పడిన దాలినాయుడు

గేదె పొడిచి వ్యక్తి మృతి

గంట్యాడ: మండలంలోని బోనంగి గ్రామానికి చెందిన ఆకలి సన్యాసిరావు అనే వ్యక్తి గేదె పొడవడంతో మృతిచెందాడు. సన్యాసి రావు రెండు రోజుల క్రితం తన గేదెలను మేపుకుని తిరిగి తీసుకువచ్చి కళ్లంలో కడుతుండగా ఒక గేదె తలతో పొడవగా వెనక్కి పడిపోయాడు. దీంతో తలకు గాయం కాగా కేజీహెచ్‌కు తసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుని భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

పార్వతీపురం రూరల్: ప్రేమ విఫలమవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన అల్లాడ తరుణ్(25) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై పట్టణ ఎస్సై గోవింద శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వైకేఎం కాలనీలో నివాసం ఉంటున్న అల్లాడ తరుణ్ తాను ప్రేమించిన అమ్మాయి కాదనడంతో మనస్తాపం చెందిన గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో గత నెల 24న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు పార్వతీపురం వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



సన్యాసిరావు మృతదేహం

ఈదురుగాలుల బీభత్సం



మామిడిపల్లిలో నేలరాలిన చెట్టు

సాలూరు: పట్టణం, మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది.ఈదురుగాలులకు మామిడిపల్లి, సారిక తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. ఈ మేరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈదురుగాలుల వల్ల ముఖ్యంగా మామిడి, జీడి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని పలువురు రైతులు వాపోతున్నారు.



పాచిపెంట మండలం పి.కోనవలస సచివాలయ భవనంపై పడిన చెట్టు